www.citytimesnews.com

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 25 | సంచిక - 339 | హైదరాబాద్ | బుధవారం | తేదీ: 04.06.2025 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## అదానీపై మళ్లీ ఫోకస్
### అమెరికా న్యాయ శాఖ దృష్టి

అమెరికా, సిటీ టైమ్స్
బిలియనీర్ గౌతం అదానీ కంపెనీలపై మళ్లీ అమెరికా ప్రాసిక్యూటర్లు ఫోకస్ పెట్టారు. ఇరాన్‌కు చెందిన ద్రవరూప పెట్రోలియం వాయువును గుజరాత్‌లోని ముంద్రా ఎయిర్‌పోర్టుకు అదానీ కంపెనీ తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2లో..

### బ్రహ్మపుత్ర నీటిని
## చైనా ఆపితే ఎలా?

పాక్ ప్రచారానికి హిమంతా కౌంటర్..!

కాలం చెల్లిన సింధూ జలాల పంపిణీ ఒప్పందం

ఇప్పుడు పాకిస్థాన్ మాకు కొత్త బూచిని చూపిస్తున్నది

వాస్తవాలతో తిప్పికొడ్తామని ఫైర్ 6లో..

## మీరేమైనా చరిత్రకారులా..?

క్షమాపణ చెబితే సరిపోయేది కదా.. 6లో..

కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం

మీరు కమల్ హాసన్ అయితే ఏంటి?

వాక్ స్వతంత్ర హక్కుతో మనోభావాలు తీయొద్దు



# ఆర్సీబీ గెలిచిందోచ్..
## నెరవేరిన 18 ఏండ్ల విరాట్ కోహ్లీ కల

- ఐపీఎల్ చాంపియన్ బెంగళూరు
- పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగుల తేడాతో విజయం
- గెలుపు తర్వాత కన్నీళ్లు పెట్టుకున్న కింగ్ కోహ్లీ
- రాయల్ ఛాలెంజ్ బెంగళూరు ఖాతాలో తొలి ట్రోఫి
- ఆర్సీబీ 190/9, పంజాబ్ కింగ్స్ 186/7

4లో..



అహ్మదాబాద్, సిటీ టైమ్స్
ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన ఫైనల్‌లో 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ (61*; 30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) పోరాడినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు. పంజాబ్ బ్యాటర్లలో జోష్ ఇంగ్లిస్ (39; 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (26), ప్రియాంశ్ ఆర్య (24), నేహల్ వధేరా (15) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2, కృనాల్ పాండ్య 2, హేజిల్‌వుడ్, రొమారియో షెఫర్డ్, యశ్ దయాళ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### రెవెన్యూ సదస్సులు
## ప్రారంభం

- 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాలేవు
- అందుకే భూభారతి తీసుకొచ్చాం

2లో..

## వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదు



2లో..

## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం

- ప్రకటించిన రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ
- 24గంటల్లో ఉక్రెయిన్‌పై దాడులు చేశాం 2లో..
- కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్ర సంబంధాలు

- జమ్మూకశ్మీర్‌లో ముగ్గురి తొలగింపు
- లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉత్తర్వులు
- వీరిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ 2లో..
- టీచర్ అజాజ్ అహ్మద్

## భారత్‌ను టార్గెట్ చేసేవారికి దూరంగా ఉండండి
### కెనడా మాజీ ప్రధాని



2లో..

### ఖమ్మం జిల్లా ఆయిల్
## పామ్ హబ్‌గా మారాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- రాష్ట్రంలో ఆయిల్ పామ్‌కు ప్రాధాన్యత
- రైతులు ఆ దిశగా సాగు చేయాలి
- అధికారులు సహకరించాలి
- ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం

7లో..



## అలర్ట్‌గా ఉండండి

- మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్
- 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- అధికారులు చూసుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలి
- పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, 3లో..
- జీహెచ్ఎంసీ కలికట్టుగా పని చేయాలని ఆదేశం



హైదరాబాద్, సిటీ టైమ్స్
అనుకున్న సమయానికంటే మందే నైరుతి రుతు పవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షా లు కురవనున్నాయంటూ ఇప్పటికే వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వర్షా కాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

## మరో 4 రోజులు వర్షా లు

హైదరాబాద్, సిటీ టైమ్స్
తెలంగాణలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. గత కొద్దిరోజులుగా వర్షా లు కురుస్తున్న సంగతి తెలిసిందే. మరో నాలుగైదు రోజుల పాటు కూడా వర్షా లు కురిసే అవకాశం ఉంది. కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం...
కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, సిద్ధిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం ఉంది. 7లో..

### కన్నీరు పెట్టుకున్న కాంగ్రెస్
## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

- ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు అందజేత
- భావోద్వేగానికి గురైన కంటతడి 7లో..
- తన చేతుల మీదుగా అందజేయడంతో ఉద్వేగం



## ఎంతో జాగ్రత్తగా భూభారతి తీసుకొచ్చాం

ఖమ్మం, సిటీ టైమ్స్
రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. 7లో..



### పార్లమెంట్ సమావేశాలు
## ఏర్పాటు చేయాలి

ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలి

దేశంలో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి

శివసేన (యూబీటీ) పార్టీ నేత సంజయ్ రౌత్ 2లో..



# అదానీపై మళ్లీ ఫోకస్

- అమెరికా న్యాయ శాఖ దృష్టి
- ద్రవరూప పెట్రోలియం వాయువు కేసు
- ఇరాన్ నుంచి గుజరాత్‌కు తరలింపు ఆరోపణలు
- విచారణ చేపడుతున్న అమెరికా న్యాయ శాఖ

**అమెరికా, సిటీ టైమ్స్**

బిలియనీర్ గౌతం అదానీ కంపెనీలపై మళ్లీ అమెరికా ప్రాసిక్యూటర్లు ఫోకస్ పెట్టారు. ఇరాన్‌కు చెందిన ద్రవరూప పెట్రోలియం వాయువును గుజరాత్‌లోని ముంద్రా ఎయిర్‌పోర్టుకు అదానీ కంపెనీ తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై వాల్ స్ట్రీట్ జర్నల్ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే ఆ ఆరోపణలను అదానీ గ్రూపు కొట్టిపారేసింది. ఇరానీ ఎల్పీజీతో తమ సంస్థలకు ఎటువంటి లింకు లేదని అదానీ గ్రూపు స్పష్టం చేసింది. అవి నిరాధార ఆరోపణలు అని పేర్కొన్నది. ఇరాన్ గల్ఫ్ నుంచి ముంద్రా పోర్టు వరకు ట్యాంకర్లు ప్రయాణించినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొన్నది. అనేక ఎల్పీజీ ట్యాంకర్లను కార్గోలుగా వాడి అదానీ కంపెనీకి తరలించినట్లు నమోదు అయిన ఆరోపణలపై అమెరికా న్యాయ శాఖ సమీక్ష చేపట్టింది. తమ పోర్టుల వద్దకు ఇరాన్ కానీ, ఇరాన్ సంబంధిత నౌక ద్వారా తమకు కార్గోలు రాలేదని అదానీ గ్రూపు చెప్పింది. కావాలని ఆంక్షల ఉల్లంఘన జరగలేదని అదానీ సంస్థ పేర్కొన్నది. అమెరికా అధికారులు ఈ కేసులో ఎటువంటి విచారణ చేపట్టడం లేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మే నెలలో కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ఇరానీ ఇంధనాన్ని లేదా పెట్రోకెమికల్ ఉత్పత్తులను ఖరీదు చేయడాన్ని ఆపేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఆ దేశం నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తే వాళ్లపై ఆంక్షలు ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు.

# భారత్‌ను టార్గెట్ చేసేవారికి దూరంగా ఉండండి

- అలాంటి వేర్పాటువాదులతో తెగదెంపులు చేసుకోవాలి
- భారత్‌కు సమస్యలు సృష్టించేవారితో స్నేహం వద్దు
- ఇండియాతో కెనాడాది స్నేహపూర్వక బంధమే

**కెనడా, సిటీ టైమ్స్**

భారత్ ను టార్గెట్ చేస్తున్న వేర్పాటువాద శక్తులతో సంబంధాలు తెంచుకోవాలని కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ ఆ దేశంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. కెనడాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనుకునే ఏ పార్టీ అయినా భారత్‌తో సమస్యలు సృష్టించిన వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోకపోతే న్యూఢిల్లీతో.. కెనడా ఎప్పటికీ స్నేహపూర్వకమైన, బలమైన సంబంధాలను కొనసాగించలేదన్నారు. భారత్‌ను విభజించాలని చూసే అరాచక శక్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని రాజకీయ పార్టీలకు సూచించారు. వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోవడానికి ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఎందుకు ఆలస్యం చేశాయో తనకు తెలియదని హార్పర్ అన్నారు. తన పదవీకాలంలో ఇటువంటి విషయాలకు దూరంగా ఉన్నామని.. ప్రస్తుత రాజకీయ పార్టీలు కూడా అదే విధానాన్ని పాటిస్తాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ఎన్నోఏళ్లుగా కెనడాకు మిత్ర దేశంగా ఉన్న భారత్‌తో తిరిగి బలమైన సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే ఇప్పటివరకు కెనడాకు, భారత్‌కు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, జిహాదీలు, యాంటీసెమిట్‌లు, ఖలిస్థానీలు వంటి విభజన సమూహాలను ప్రోత్సహించడం ఆపాలన్నారు. ఇవి మాత్రమే ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు హార్పర్ 2006నుంచి 2015 వరకు కెనడా ప్రధానమంత్రిగా ఉన్నారు. 1985 జూన్ 23న ఖలిస్థానీ ఉగ్రవాదులు ఎయిర్ ఇండియా విమానం కనిష్కపై బాంబు దాడి చేసిన ఘటనపై ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. రిటైర్డ్ జస్టిస్ జాన్ మేజర్ నేతృత్వంలోని ఆ కమిషన్ జులై 16, 2010న తన నివేదికను సమర్పించింది. ఈ దాడికి దారితీసిన వైఫల్యాలకు తమ ప్రభుత్వం తరఫున అప్పట్లోనే భారత్‌కు క్షమాపణలు తెలిపారు. దశాబ్దాలతరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య గత కొంతకాలంగా సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించడంతో.. భారత్, కెనడాల మధ్య ఉద్రిక్తతలు చెలరేగాయి. అనంతరం కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి భారత్ యత్నిస్తోందంటూ కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీసు డిప్యూటీ డైరెక్టర్ సంచలన ప్రకటన చేశారు. దీంతో ఇరుదేశాల మధ్య దూరం మరింత పెరిగింది. కెనడా ప్రధానిగా ఉన్న మార్క్ కార్నీ ఎన్నికయిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



# వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదు



- ఇలా స్వేచ్ఛగా మాట్లాడం తప్పే
- శర్మిష్ఠ బెయిల్ నిరాకరించిన హైకోర్టు
- ఆపరేషన్ సిందూర్‌పై అభ్యంతర కామెంట్లు
- తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు

**కోల్‌కతా, సిటీ టైమ్స్**

న్యాయ విద్యార్థి శర్మిష్ఠ పనోలీకు కోల్‌కతా హైకోర్టులో నిరాశే మిగిలింది. తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్‌పై సినీ ప్రముఖులు మౌనం వహించడంపై శర్మిష్ఠ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. స్వేచ్ఛగా మాట్లాడడం అంటే ఇదేనా అని మండిపడింది. వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదని.. మతపరమైన వ్యాఖ్యలతో ఎవరి మనోభావాలను దెబ్బతీసేందుకు ఈ హక్కు వీలు కల్పించలేదని గుర్తు ఉంచుకోవాలి అని హైకోర్టు హితవు పలికింది. "ఆమెకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఒక వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించారు. వాక్ స్వాతంత్ర్యం ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. కానీ, ఇతరులను బాధపెట్టేలా మాట్లాడమని దాని అర్థం కాదు. మన దేశం వైవిధ్యభరితమైనది. అనేక కులాల, మతాల ప్రజలు ఇక్కడ కలిసి జీవిస్తున్నారు. అలాంటప్పుడు మనం ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి" అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.
శర్మిష్ఠకు మధ్యంతర బెయిల్ మంజూరుకు నిరాకరించిన కోర్టు.. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా.. ఉగ్రవాదులు పహల్గాంలో పురుషులపై జరిపిన మారణహోమం తర్వాత భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై కొందరు బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న శర్మిష్ఠ సోషల్ మీడియా వేదికగా చేసిన వీడియో పోస్ట్ వివాదాస్పదంగా మారింది. ఆమె పోస్టుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత తన పోస్టులు, రీల్స్ తొలగించిన ఆమె క్షమాపణలు కోరారు. అనంతరం శర్మిష్ఠను పోలీసులు అరెస్టు చేశారు.
కోల్‌కతా పోలీసుల చర్య భారత్‌లోని వాక్‌స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని టీఎంసీ ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఆమెను వెంటనే విడుదల చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే శర్మిష్ఠ పనోలీ బెయిల్ అభ్యర్థనను నిరాకరించిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్ర సంబంధాలు

## ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీం

**జమ్మూ కాశ్మీర్, సిటీ టైమ్స్**

ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై జమ్మూకశ్మీర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముగ్గురు ఉద్యోగులకు లష్కరే తయ్యిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, స్కూల్ టీచర్ అజాజ్ అహ్మద్ , ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ వసీం అహ్మద్‌ఖాన్ ఉన్నారు. జాతీయ భద్రతా ప్రయోజనాలరీత్యా వీరిని తొలగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యవర్గం ఇప్పటివరకు 75 మంది గవర్నమెంట్ ఉద్యోగులకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించి.. వారిని తొలగించింది. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరించే వారి కోసం వేటను కొనసాగిస్తోంది. దీంతో పాటు



ప్రభుత్వ ఉద్యోగుల్లో సానుభూతిపరులను కూడా గుర్తిస్తోంది. తాజాగా తొలగించిన ముగ్గురు ఉద్యోగులు ఉగ్రమూకకు సరకులు అందజేయడం, ఆయుధాల స్మగ్లింగ్, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ముష్కరుల కార్యకలాపాలకు సాయం చేయడం వంటివి చేసినట్లు తేలింది.

**అతడు పోలీస్.. సోదరుడు ఉగ్రవాది..!**

మాలిక్ ఇష్ఫాక్ 2007లో కానిస్టేబుల్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతడి సోదరుడు మాలిక్ ఆసీఫ్ పాక్‌లో శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాది. 2018లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో అతడిని మట్టుబెట్టారు. సోదరుడి మరణం తర్వాత కూడా ఇష్ఫాక్ ఉగ్ర కార్యకలాపాలను కొనసాగించాడు. ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను ఎక్కడ జారవిడవాలో పొజిషన్లను గుర్తించేవాడు. ఆ లొకేషన్ జీపీఎస్ కోఆర్డినేట్‌స్‌ను పాక్‌లోని హ్యాండ్లర్లకు పంపేవాడు. ఇక అక్కడికి చేరిన ఆయుధాలను గుర్తించి.. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు చేరవేసేవాడు. 2021లో తొలిసారి ఆయుధాలు, పేలుడు పదార్థాల చేరవేత కేసులో ఇతడికి లష్కరేతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**పైకి టీచర్‌గా.. లోపల హిజ్బుల్ కార్యకర్తగా..**

ఇక అజాజ్ అహ్మద్ 2011లో విద్యాశాఖలో టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. అతడు హిజ్బుల్ ముజాహిద్దీన్ సంస్థకు ఆయుధాలు, ప్రచార సామగ్రిని స్మగ్లింగ్ చేసేవాడు. 2023లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో అతడు, అతడి మిత్రుడు దొరికిపోయారు. అతడికి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని హిజ్బుల్ ఆపరేటివ్ అబిద్ రంజాన్ షేక్ నుంచి ఆయుధాలు వచ్చినట్లు గుర్తించారు. గత కొన్నేళ్లుగా అతడు ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు. హిజ్బులక్‌కు కశ్మీర్‌లోని పూంచ్‌లో నమ్మకమైన కార్యకర్తగా ఎదిగాడు.

**సుజాత్ బుఖారీ హత్య కుట్రలో నిందితుడు..**

ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీమ్ అహ్మద్ ఖాన్ లష్కరే, హిజ్బుల్ సంస్థల కోసం పనిచేస్తున్నాడు. జమ్మూ కశ్మీర్‌లో సంచలనం సృష్టించిన జర్నలిస్ట్ సుజాత్ బుఖారీ, ఆయన అంగరక్షకుడి హత్య కుట్రలో ఇతడి హస్తం ఉంది. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఘటనా స్థలం నుంచి తప్పించేందుకు ఇతడే సాయం చేసినట్లు గుర్తించారు.
2018లో ఆగస్టులో శ్రీనగర్‌లోని బట్‌మాలూ వద్ద ఉగ్రదాడిపై విచారణ సమయంలో ఇతడిని తొలిసారి అరెస్ట్ చేశారు.

# రెవెన్యూ సదస్సులు ప్రారంభం
## భూ సమస్యల్లేని తెలంగాణ ఏర్పాటుకు కృషి



**ఖమ్మం, సిటీ టైమ్స్**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వల్ల భూ సమస్యలు పరిష్కారం కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చింది. భూ సమస్యలు లేని తెలంగాణ కోస ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల భూ సమస్యలు తీర్చాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి ఆర్వోఆర్ యాక్ట్ ఈఈర్భావ దినోత్సవం జూన్ 02 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. నేటి నుంచి (జూన్ 03) ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. మానవీయ కోణంలో భూసమస్యలను పరిష్కరించాలని కోరింది. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో అన్నీ రెవెన్యూ గ్రామాలకు తహశీల్దార్ తో కూడిన బృందం వెళ్లనుంది. ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కారించనున్నారు. మండలాల వారిగా రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ని ప్రకటించి ఏ రోజున ఏ గ్రామంలో సదస్సు జరుగుతుందనేది ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తున్నారు.
భూ భారతి చట్టం ద్వారా ధరణిలో పరిష్కారం కాని సాదా బైనామా, మిస్సింగ్ సర్వే నంబర్, రైతు వివరాలల్లో తప్పులు, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్, అసైన్డ్ టు పట్టా క్లాసిఫికేషన్, ప్రోహిబిటెడ్ జాబితా మార్పు, సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, భూసేకరణ సమస్యలు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల మధ్య డిస్‌ప్యూట్ ఉన్న భూముల మార్పు, తదితర అంశాల కోసం భూ భారతి ఆర్వోఆర్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం

## సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులు ధ్వంసం

**ఉక్రెయిన్, సిటీ టైమ్స్**

ఒక వైపు రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం చర్చలకు సన్నాహాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత 24గంటల్లో ఉక్రెయిన్‌పై తమ బలగాలు చేసిన దాడుల్లో 1,430 మందికి పైగా ఆ దేశ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేశామన్నారు.
మరో వైపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చిందని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ ప్రకటించింది. యుద్ధంలో మొత్తం 9,90,800 మంది రష్యన్ సైనికులు మరణించారని..అందులో 1,100 మంది సైనికులు గత 24 గంటల్లో మరణించారని పేర్కొంది. తమ దాడుల్లో రష్యా 10,881 ట్యాంకులు, 22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 బహుళ ప్రయోగ రాకెట్ వ్యవస్థలు, 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384 విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, ఒక జలాంతర్గామిని కోల్పోయిందని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపారు.
రష్యా, ఉక్రెయిన్ మధ్య సోమవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లోని సిరగాన్ ప్యాలెస్‌లో తుర్కియే విదేశాంగశాఖ మంత్రి హకన్ ఫిదాన్ అధ్యక్షతన సోమవారం రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ షరతులపై వారు చర్చించారు. అవి ఫలితమిచ్చినట్లు ఏ వర్గమూ ప్రకటించలేదు. ఈ చర్చలకు ముందు ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద దాడి చేయడం గమనార్హం. దీనికి ప్రతిగా మాస్కో సైతం ఉక్రెయిన్‌లో 1,000 కిలో మీటర్ల దూరం వెళ్లి.. 472 డ్రోన్‌లతో విరుచుకుపడింది.



# పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలి

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

ఆపరేషన్ సిందూర్ వేళ దేశంలో ఇప్పటి వరకు చోటు చేసుకొన్న పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని శివసేన (యూబీటీ) పార్టీ నేత సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. నేడు ఇండియా అలయన్స్ భేటీ తర్వాత ఆయన మాట్లాడారు. "16 ప్రతిపక్ష పార్టీల నేతలు సంతకాలు చేసిన లేఖను ప్రధాని మోదీకి పంపాము. అది సాధారణమైనది కాదు. ట్రంప్ సూచన మేరకు కాల్పుల విరమణ ప్రకటించినప్పుడు.. మేము పలు మార్లు కోరినా ప్రత్యేక సెషన్ ఎందుకు ఏర్పాటు చేయడం లేదు. ఇప్పుడు ప్రత్యేక సెషన్ కావాలంటే ట్రంప్ వద్దకు వెళ్లాలా..?" అని ప్రశ్నించారు.
నేడు దేశ రాజధాని ఢిల్లీలో ఇండియా బ్లాక్‌లోని కీలక పార్టీల నాయకులు భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఇండియా కూటమి ఎంపీలు వినతి పత్రంపై సంతకాలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్, టీఎంసీ నుంచి డెరెక్ ఒబ్రియాన్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి రామ్ గోపాల్ యాదవ్, ఆర్జేడీ నుంచి మనోజ్ ఝా, శివసేన యూబీటీ నుంచి సంజయ్ రౌత్ తదితరులు హాజరయ్యారు.
ఎన్‌సీపీ, సీపీఐ (ఎం), ఐయూఎంఎల్, సీపీఐ, ఆర్ఎస్‌పీ, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ (ఎంఎల్) తదితర పార్టీలు కూడా లేఖపై సంతకాలు చేశాయి. ఇక డీఎంకే లేఖపై సంతకం చేసినా..కరుణానిధి జయంతి సందర్భంగా సమావేశానికి మాత్రం హాజరు కాలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రం ప్రత్యేకంగా ప్రధానికి వేరే లేఖ పంపుతోంది. ఇక నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి ఎటువంటి డిమాండ్ రాలేదు.



# జర్నలిస్టుల జాగకే ఎసరు

- శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలం ఆక్రమణ
- ఫెన్సింగ్ కూల్చివేసి కబ్జాకుయత్నం
- స్థలం మధ్యలో నుంచి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకుయత్నం
- ఎమ్మెల్యే, చందానగర్ డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదు
- ఫెన్సింగ్ కూల్చివేతపై క్రిమినల్ కేసు నమోదుకు
- డిప్యూటీ కమిషనర్ ఆదేశం







**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** ఖాళీ స్థలాలు కబ్జా చేసే కబ్జారాయుళ్లకు ఖాళీ జాగా దొరకడం లేదని, కంచె వేసిన స్థలాల్లో సైతం కన్నేస్తున్నారు. ఏకంగా కబ్జారాయుళ్లపై కథనాలు రాసే జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలనే కబ్జా చేసేందుకు సమాయత్తమ్యారు అక్రమార్కులు. అదెక్కడో కాదు.. శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్ లోనే..

చందానగర్ లో జర్నలిస్టులకు కేటాయించిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన కబ్జాదారులు స్థలం చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెను తొలగించారు. స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులు స్తంభాల నిర్మాణ పనులు చేపట్టగా, సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జర్నలిస్టులు పనులను అడ్డుకొని విషయాన్ని మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ డిప్యూటీ కమిషనర్, చందానగర్ కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం చందానగర్ లోని సర్వే నెంబర్ 174లో 1 ఎకరా స్థలాన్ని గతంలోనే కేటాయించిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి, పొజిషన్ హ్యాండ్ ఓవర్ చేసిన ఈ స్థలం చుట్టూ జర్నలిస్టులు ఖడీలు ఏర్పాటు చేసి రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. సోమవారం కొంతమంది కబ్జాదారులు ఫెన్సింగ్ కూల్చివేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారు.

దీంతోపాటు ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి, జర్నలిస్టుల ఇళ్ల స్థలం మధ్యలో నుంచి స్తంభాలను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు విద్యుత్ శాఖ అధికారుల పనులను అడ్డుకొని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. ఫెన్సింగ్ కూల్చివేతపై ఎమ్మెల్యే గాంధీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల తీరుపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క స్థలంలో ఉన్న విద్యుత్ లైన్ ను మార్చి తమ స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఏడీఈని ప్రశ్నించారు. దీంతో తప్పు తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు నాటిన స్తంభాలను తొలగించడంతో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫెన్సింగ్ కూల్చివేతపై శేరిలింగంపల్లి జర్నలిస్టులు చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఫెన్సింగ్ కూల్చివేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ల నాయకులు, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి ఘనంగా సన్మానం



**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** ఎఐసిసి ఆదేశాల మేరకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మినాక్షి నటరాజన్, తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల ఆహారం, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ టిజి డి శ్రీధర్ బాబు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఎంపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు జై హింద్ సభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి విజయవంతం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మేడ్చల్ జిల్లా నియోజకవర్గ ఇంచార్జులు , కార్యకర్తలు, నాయకులకు హార్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి 8 డివిజన్ల అధ్యక్షులు మ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి శాల్వాతో సత్కరించి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్, అల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్, డివిజన్ అధ్యక్షులు ఎండి లయాక్, గణేష్, బి శివకుమార్, పందరీ రావు, సంతోష్ ముదిరాజ్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, ఎండి.జాకీర్, బేకు శ్రీనివాస పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన

**- సిందం శ్రీకాంత్**



**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లని కనీసం 12 గంటలు గడవకముందే అధికారులతో చెప్పి తొలగించి వేయడం అంటే కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదు ,తెలంగాణ ప్రజల వ్యతిరేక పాలన అని సిందం శ్రీకాంత్ తీవ్రంగా ఆక్షేపించారు . కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు ఫ్లెక్సీలు వారాల తరబడి ఉన్నా తీయకుండా ఉన్నారని, కానీ ఇప్పుడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడం దుర్మార్గమని, కనీసం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం అని కూడా గౌరవం లేకుండా తొలగించడం అంటే దుర్మార్గమని ఆయన విమర్శించారు. అయినా ఆనాడే రేవంత్ రెడ్డి ఉద్యమ సమయంలో ఉద్యమకారులను భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నంలో తుపాకీ పట్టుకొని వచ్చిన తుపాకీ రాయుడు రేవంత్ రెడ్డికి తెలంగాణ విలువ తెలవదని ఆయన దుయ్యబడ్డారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఇబ్బంది పాలు చేయాలి అన్న దాంట్లో సగం శ్రద్ధ పరిపాలన మీద పెడితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని, ఈనాడు బస్తీల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, వీధి దీపాలు గత కొన్ని నెలలుగా వెలుగుతలేదని వాటి మీద ఆ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ,రాష్ట్ర పరిపాలన గతి తప్పిందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు.

# భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత

- మనిషికి ఆధార్ కార్డు లాగానే భూమికి భూదార్
- భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం
- రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- భూ సమస్యలను పరిష్కరించుకోవాలి
- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** భూ భారతి కొత్త ఆర్ ఓ ఆర్ చట్టమని అందులో భాగంగా భూమి హక్కులు భద్రం.. భూ సమస్యల సత్వర పరిష్కారం.. రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు అని, భూ భారతి చట్టం.. రైతుల చుట్టమని పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం శేరిలింగంపల్లి మండల పరిధిలో 3 నుండి 6వరకు జరిగే రెవెన్యూ సదస్సులలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలి దొడ్డిలోని వార్డు కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్ వెంకారెడ్డి, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిఎసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ ప్రసంగించారు. రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ చేస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తుందని తెలిపారు.

3 నుండి 6వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ,ఉదయం 10 గంటలకు నిర్దేషిత ప్రాంతంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ చంద్రారెడ్డి, అధికారులు మరియు నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## సైక్లింగ్ అనేది ఆరోగ్యకరమైన రవాణా మార్గం

**-ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో మంగళవారం ప్రపంచ బైసైకిల్ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయం ఆవరణలో సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవం అనేది ఏ లక్షణంతో సంబంధం లేకుండా అందరూ ప్రజలు ఆనందించాల్సిన ప్రత్యేక రోజు మానవ పురోగతి, పురోగతికి చిహ్నంగా సైకిల్ సహనం, పరస్పర అవగాహన గౌరవాన్ని ప్రోత్సహిస్తుంది. సామాజిక సమ్మిళితత్వాన్ని, శాంతి సంస్కృతిని సులభతరం చేస్తుందన్నారు. స్థిరమైన రవాణాకు చిహ్నం స్థిరమైన వినియోగం ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సానుకూల సందేశాన్ని అందిస్తుందన్నారు. వాతావరణ పై సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కోలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ మెంబర్స్ భీమ్ సింగ్, గడిలా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అలర్ట్‌గా ఉండండి



**హైదరాబాద్, సిటీ టైమ్స్** అనుకున్న సమయానికంటే మందే నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురవనున్నాయంటూ ఇప్పటికే వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిపై ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపుల ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు

అలాగే వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు.

ఇక సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలనున్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అవినీతి సాధారణ నేరం కాదు

అవినీతి అనేది సాధారణ నేరం కాదు... ప్రజల దైనందిన జీవితాలను దుర్భరం చేసే మహాపాతకం. ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన వనరులు, అవకాశాలు, న్యాయం వంటివాటిని సామాన్యజనానికి అందుబాటులో లేకుండా చేసే దుష్టశక్తి అది. రికార్డుల్లో తన భూమి వివరాలను తప్పుగా నమోదుచేశారని, వాటిని సరిచేయాలని కాళ్లావేళ్లా పడుతున్న మనిషిని లక్షన్నర రూపాయల లంచం డిమాండ్ చేశాడు చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఇన్‌ఛార్జి తహసీల్దార్. సాధారణ రైతు అయిన బాధితుడు అంత డబ్బును ఎక్కడి నుంచి తీసుకురాగలడు? నకిలీ వైద్యులను కటకటాల్లోకి పంపకుండా ఉండటానికి రూ.16 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు సూర్యాపేటకు చెందిన ఇద్దరు పోలీస్ అధికారులు. అలా గడ్డి మేసి దొంగ డాక్టర్లను వదిలేస్తే అమాయక రోగుల ఇల్లూఒళ్లూ గుల్లవుతాయి కదా! ఒడిశా గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ ఇంటికి విజిలెన్స్ అధికారులు తాజాగా సోదాలకు వెళ్తే- రూ.37లక్షల అక్రమార్జనను ఆ మహానుభావుడు కిటికీలోంచి విసిరేశాడు. ఇలాంటి లంచావతారులు ప్రతి రాష్ట్రంలో ప్రతిచోటా కనపడతారు. అవినీతి నిరోధక చట్టాల దారుణ వైఫల్యానికి ప్రతీకలుగా బోరవిరుచుకుని తిరుగుతుంటారు!

తెలంగాణ 'రెరా' కార్యదర్శి బాలకృష్ణ, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ హరిరామ్ చెరో వంద కోట్ల రూపాయల చొప్పన అక్రమాస్తులను పోగేసినట్లు ఇటీవల వెలుగుచూసింది. తిరుపతి జిల్లాలో ఓ మామూలు పంచాయతీ కార్యదర్శి రూ.30 కోట్ల ఆస్తిపాస్తులను కూడబెట్టినప్పుడు అధికార దొంతరలో పైన ఉన్నవారు ఇంకెంతగా దోచుకుని దాచుకుంటున్నారో ఎవరికి తెలుసు? చిన్నాచితకా అవినీతి కార్యకలాపాల మూలంగానే జనభారతం ఏడాదికి రూ.21వేల కోట్లు కోల్పోతోంది. ఇక యావత్ జాతికీ చెందాల్సిన ప్రాకృతిక వనరులను గుటకాయ స్వాహా చేసే చీకటి ఒప్పందాల కారణంగా దేశం సంవత్సరానికి లక్ష కోట్ల రూపాయలు నష్టపోతోంది. పైగా ఇవన్నీ పదేళ్ల కిందటి లెక్కలు... భ్రష్టాచారాల తీవ్రత పెరిగిన ప్రస్తుత భారతంలో అవినీతిపరుల చెరలోకి చేరుతున్న ప్రజాధనం విలువెంతో ఊహకైనా అందదు. సామాజిక న్యాయసాధనలో ప్రధాన అవరోధమవుతున్న అవినీతిని అరికట్టడంలో కఠినంగా వ్యవహరించక తప్పదని సుప్రీంకోర్టు గతంలోనే నిర్దేశించింది. ఆ దిశగా ప్రభుత్వాలు చేస్తున్నది దాదాపు పూజ్యం. అన్ని రకాల అక్రమాలకు తల్లివేరుగా రాజకీయ అవినీతి వర్ధిల్లుతుండటమే దీనికి కారణం! '2019 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థుల మొత్తం ఖర్చు రూ.50వేల కోట్లు అని అంచనా. 2024లో అంతకు రెట్టింపు మొత్తంలో వెచ్చించారు. కాంట్రాక్టులూ ఇతరాల రూపంలో లబ్ధి పొందాలనుకునేవారే నేతలకు డబ్బు సమకూరుస్తుంటారు' అని మాజీ కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, 'పద్మభూషణ్' బి.కె. చతుర్వేది మొన్నామధ్య విశ్లేషించారు. రాజకీయ నాయకులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి చేసే దోపిడిలో 'నాకిది-నీకది' పద్ధతిలో ప్రభుత్వ యంత్రాంగమూ చేతులు కలుపుతోంది. జనం రక్తంతాగి కూడబెట్టిన సొమ్ములోంచి నేతలకు వాటాలిచ్చి మంచి పోస్టింగులు తెచ్చుకుని, ఆపై అంతకంతా రాబట్టుకునే ప్రబుద్ధ అధికారులూ లెక్కకుమిక్కిలిగా పోగుపడ్డారు. ఈ అవినీతి విషవలయాన్ని ఛేదించాలంటే- ఆర్థిక నేరగాళ్లు నాయకులుగా చలామణీ అయ్యే దౌర్భాగ్య వాతావరణాన్ని చెదరగొట్టాలి. వేగవంతమైన విచారణలతో నేరచరిత నేతల ముసుగులు తొలగించాలి. అందుకు బలమైన, స్థిరమైన రాజకీయ సంకల్పం అత్యవసరం.

# పాక్ ప్రగల్భాలు అన్నీ అబద్ధాలు!

**భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో చిత్తుగా దెబ్బతిన్న పాకిస్థాన్ అసత్య ప్రచారాన్ని ఆపలేదు. ఇండియాపై తాము చేపట్టిన ఆపరేషన్ ఘన విజయం సాధించిందంటూ పాక్ ప్రధాన సైన్యాధికారి జనరల్ అసిం మునీర్ ఊదరగొట్టారు. ఇస్లామాబాద్ మొదటి నుంచీ ఢిల్లీ చేతిలో చావుదెబ్బ తింటూనే ఉన్నా, ఇంతవరకు ఏ పాక్ ప్రధాన సైన్యాధికారీ తన వైఫల్యాన్ని ఒప్పుకోలేదు.పహల్గాం ఉగ్రదాడి క్రమంలో భారత్‌తో పోరాడలేక చేతులెత్తేసిన పాకిస్థాన్- తన ఓటమిని గెలుపుగా భ్రమింపజేయడానికి పూనుకుంది. ఇస్లామాబాద్ 1948లోనే కశ్మీర్‌లో ఘోర పరాజయం పాలైంది. నాడు కశ్మీర్‌లో కొంత భూభాగాన్ని మాత్రమే కైవసం చేసుకోగలిగిన పాకిస్థాన్ తనదే విజయమంటూ ప్రచారం చేసుకుంది. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో ఓడిపోయే ముందురోజు వరకు భారత సైన్యం చిత్తయిపోతోందనీ, ఇక తమదే విజయమనే భ్రమను అప్పటి పాక్ నియంత యాహ్యా ఖాన్ ప్రచారం చేశారు. చివరికి పాక్ సైన్యం భారత్‌కు లొంగిపోవడంతో యాహ్యా అబద్ధాలు బట్టబయలయ్యాయి.**

**మునీర్‌దీ అదే నైజం...**

పాకిస్థాన్ 1999 నాటి కార్గిల్ యుద్ధంలోనూ మట్టికరిచింది. అందుకు నాటి ప్రధాన సైన్యాధికారి పర్వేజ్ ముషారఫ్ బాధ్యత వహించి రాజీనామా చేయాల్సిందిపోయి నవాజ్ షరీఫ్‌ను బలిపశువును చేశారు. షరీఫ్‌ను గద్దె దించి తానే దేశాధ్యక్షుడయ్యారు. ఆఖరికి ముషారఫ్ కూడా పరాయి దేశంలో శరణు పొందాల్సి వచ్చింది. ఓటమిని విజయంగా బుకాయించే నైజాన్ని తాజాగా జనరల్ అసిం మునీర్ కూడా ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌తో చావు తప్పి కన్ను లొట్టపోయినా, తన కీలుబొమ్మ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి ఇప్పించుకున్నారు. 'గొప్ప వ్యూహం, సాహసిక నాయకత్వంతో భారత్‌ను చిత్తుగా ఓడించిన మునీర్'కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి ఇస్తున్న'ట్లు పాక్ మంత్రివర్గం ప్రకటించింది. నిజానికి ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చెలరేగిపోతున్నప్పుడు జనరల్ మునీర్ భూగర్భ బంకరులో దాక్కున్నారు. ఢిల్లీ దెబ్బకు తోక ముడిచి కాల్పుల విరమణ అంటూ కాళ్ల బేరానికి వచ్చారు! పాకిస్థాన్‌కు గతంలో అయూబ్ ఖాన్ అనే ఫీల్డ్ మార్షల్ ఉండేవారు. అసిం మునీర్‌కూ ఆయనకూ మధ్య పోలిక ఉంది. 1959లో సైనిక తిరుగుబాటుతో అధికారం చేపట్టిన అయూబ్ ఖాన్ తనకు తానే ఫీల్డ్ మార్షల్‌నని చాటుకున్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ జనరల్ అసిం మునీర్ తన పదోన్నతి పత్రాన్ని తానే రూపొందించుకుని సంతకం పెట్టాలంటూ షెహబాజ్ షరీఫ్‌కు పంపారు. షెహబాజ్ కిమ్మనకుండా దానికి ఆమోద ముద్ర వేశారు.

తాను గొప్ప అని చాటుకోవడంతోపాటు భారత్‌ను తక్కువ చేసి చూపడానికి పాక్ బోగస్ ప్రచారానికి దిగింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడే ఢిల్లీ పహల్గాంలో ఉగ్రదాడి పేరుతో కపట నాటకానికి తెరలేపిందని ఇస్లామాబాద్ ఆరోపించింది. పాక్ వల్ల ఇండియా భద్రతకు ముప్పు లేకపోయినా, స్వదేశంలో రాజకీయ లక్ష్యాలు సాధించుకోవడానికే భారత్ పహల్గాం దాడి అంటూ నాటకమాడిందని ఆరోపించింది. తన వాదనకు బలం చేకూర్చేందుకు నకిలీ వీడియోలు, ఫొటోలను ప్రచారంలో పెట్టింది. గతంలో పుల్వామా దాడి జరిగినప్పుడు భారత ప్రభుత్వ వైఫల్యాలను రాజకీయవాదులు, పాత్రికేయులూ విమర్శించారు. పాకిస్థాన్ నాటి వీడియోల్లోని పుల్వామా అనే పదాన్ని పహల్గాంగా మార్చి బోగస్ వీడియోలను వదిలింది. పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పర్యాటకుల మతం తెలుసుకుని మరీ హతమార్చారనే వాస్తవాన్ని మరుగుపరచింది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తమ ప్రార్థనాస్థలాలపై బాంబులు కురిపించి, అమాయకుల ప్రాణాలు తీసిందని పాక్ ఆరోపించింది. లష్కరే తయ్యిబా ఉగ్రవాద సంస్థ మురీద్కేలోని ఒక మసీదులో ప్రధాన కార్యాలయాన్ని నెలకొల్పింది. భారత్ దాడిలో అక్కడ హతులైన ఉగ్రవాదుల మృతదేహాలకు పాక్ జాతీయ జెండాను కప్పారనే సంగతిని ఇస్లామాబాద్ కప్పిపెట్టింది. యుద్ధంలో మరణించిన సైనికుల అంత్యక్రియలకు హాజరుకాని ఉన్నతస్థాయి సైన్యాధికారులు... ఉగ్రవాదుల ఖననంలో మాత్రం పాల్గొనడం ఆశ్చర్యకరం! ఉగ్రవాదుల ఖననం సందర్భంగా ప్రార్థన చేసిన లష్కర్ కమాండర్ అబ్దుల్ రవూఫ్ తలమీద భారీ నగదు బహుమతి ఉంది. అయినా అతడు ఉగ్రవాది కాదని పాక్ బుకాయించింది. బలూచిస్థాన్‌లో పాక్ సైన్యం దాడిలో మరణించినవారిని భారత్ దాడిలో హతమైన పాక్ పౌరులుగా భ్రమింపజేయడానికి నకిలీ ఫొటోలను ప్రచారంలో పెట్టింది.

**ఎండగడుతున్న ఇండియా**

ఆదంపూర్, భుజ్‌లలో ఎస్400 క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేశామని పాకిస్థాన్ గొప్పలు చెప్పుకొంది. ఇది వట్టి అబద్ధమని నిరూపించడానికి ప్రధాని మోదీ ఆదంపూర్ స్థావరానికి వెళ్లి అక్కడ చెక్కుచెదరకుండా ఉన్న ఎస్400 వ్యవస్థ ముందు ఫొటో దిగి ప్రపంచానికి విడుదల చేశారు. పహల్గాం దాడి వెనక పాక్ హస్తం, దానికి ప్రతిగా తాము చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాటు సింధు జలాల ఒప్పందం అమలును నిలిపేయడం గురించి ప్రపంచానికి వివరించడానికి భారత్ ఏడు పార్లమెంటరీ బృందాలను విదేశాలకు పంపింది. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు పాకిస్థాన్ కూడా బిలావల్ భుట్టో నాయకత్వంలో ప్రతినిధి బృందాన్ని విదేశాలకు పంపింది. భారత్ భారీగా నష్టపోయిందంటూ ఇస్లామాబాద్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఢిల్లీ సమర్థంగా అడ్డుకుంటోంది. తన దాడిలో ధ్వంసమైన పాక్ స్థావరాల వీడియోలు, ఫొటోలను ప్రపంచానికి చూపుతోంది. పాక్ దాడిలో దెబ్బతిన్నాయంటున్న భారతీయ స్థావరాలు నిక్షేపంలా ఉన్నాయని నిరూపించడానికి వాటి చిత్రాలనూ విడుదల చేస్తోంది. తద్వారా ఓటమిని విజయంగా చూపే పాక్ నైజాన్ని ఎండగడుతోంది.

# సంయమనం అవసరం

**నెత్తురు చిందకుండా, నష్టం జరగకుండా యుద్ధం సాగుతుందనీ, ముగుస్తుందనీ ఎవరూ అనుకోరు. ప్రత్యర్థిని చిత్తు చేద్దామని ఇరుపక్షాలూ విశ్వప్రయత్నం చేస్తాయి. కానీ అనేక కారణాలవల్ల ఎవరో ఒకరినే విజయం వరిస్తుంది. ఇందులో సరైన అంచనాలకు రాలేకపోవటం దగ్గరనుంచి స్థానిక వాతావరణ స్థితిగతుల వరకూ చాలా వుంటాయి. ఈ సంగతి తెలిసి కూడా మన విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ మొన్నటి 'ఆపరేషన్ సిందూర్'లో మనకు కలిగిన నష్టాలగురించి వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి.**

యాదృచ్ఛికంగానే కావొచ్చుగానీ... మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శనివారం సింగపూర్‌లో మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని 'వ్యూహాత్మక తప్పిదాల' కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. ఆ అంశాన్ని ప్రభుత్వ పెద్దలకు వదలటం లేదా వారితో చర్చించి ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో సలహా తీసుకోవటం సరైన విధానం. విదేశీ గడ్డపై చెప్పటమైతే ఎంతమాత్రమూ సరికాదు. పైగా ఆయన సింగపూర్ వెళ్లింది ఏటా జరిగే అంతర్ ప్రభుత్వాల భద్రతా వ్యవహారాలపై నిర్వహించే 'షాంగ్రీలా డైలాగ్' కోసం.

అందులో పాకిస్తాన్ త్రివిధ దళాల చీఫ్ కూడా పాల్గొన్నారు. ఒకపక్క మన ఎంపీల అఖిలపక్ష బృందాలు పాకిస్తాన్ ఆగడాల గురించీ, వాటిని నిలువరించక తప్పని స్థితి గురించీ వివరించటానికి వేర్వేరు దేశాల్లో పర్యటిస్తున్నాయి. కనుక జనరల్ చౌహాన్ ప్రకటన ఏ రకంగా చూసినా సమయం, సందర్భం లేనిది. కొందరు మాజీ సైనికాధికారులూ, నిపుణులూ చెప్పినట్టు పాకిస్తాన్‌కు మన దళాలు కలిగించిన భారీ నష్టంతోపాటు దీన్నీ చెప్పివుంటే ఇంత వివాదమయ్యేది కాదేమో! గత నెల 7 నుంచి పదో తేదీ వరకూ సాగించిన దాడుల్లో మన నష్టం ఏపాటో చెప్పాలని విపక్షాలు కోరుతున్నాయి. దాడి చేయటానికొచ్చిన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రచారం ఆధారంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ డిమాండ్ మొదలుపెట్టారు. మన సైనిక దళాలు సాధిస్తున్న విజయాలను ఎన్డీయే ప్రభుత్వం తన సత్తాకు ప్రతీకగా చెప్పుకోవటాన్ని నిరోధించేందుకు విపక్షాలు ఈ ప్రయత్నం చేసివుండొచ్చు. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేయాలనే అంశాలను పూర్తిగా త్రివిధ దళాలకు అప్పగించాక వాటిపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా మాట్లాడటం ఎవరు చేసినా తప్పే. యుద్ధంలో తొలి క్షతగాత్ర సత్యమేనంటారు. ఎందుకంటే అవతలి పక్షాన్ని చావుదెబ్బ తీశామని, అనేకమంది శత్రు సైనికుల్ని హతమార్చామని, కీలక స్థావరాలు ధ్వంసం చేశామని ప్రభుత్వాలు చెప్పటం ప్రపంచంలో ఎక్కడైనా వున్నదే.









# ఆర్సీబీ గెలిచిందోచ్..

**అహ్మదాబాద్, సిటీ టైమ్స్**

**ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ (61*; 30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) పోరాడినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు. పంజాబ్ బ్యాటర్లలో జోష్ ఇంగ్లిస్ (39; 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (26), ప్రియాంశ్ ఆర్య (24), నేహల్ వధేరా (15) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2, కృనాల్ పాండ్య 2, హేజిల్‌వుడ్, రొమారియో షెఫర్డ్, యశ్ దయాళ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.**

**ఆరంభం బాగున్నా..**

లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 43 పరుగులు జోడించారు. హేజిల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ ఇచ్చిన క్యాచ్‌ను రొమారియో షెఫర్డ్ అందుకోలేకపోయాడు. హేజిల్‌వుడ్ వేసిన ఐదో ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన ప్రియాంశ్.. చివరి బంతికి ఔటయ్యాడు. బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో ప్రియాంశ్ వెనుదిరిగాడు. పవర్ ప్లే ముగిసేసరికి పంజాబ్ 52/1తో నిలిచింది. సుయాశ్ శర్మ వేసిన 8వ ఓవర్‌లో జోష్ ఇంగ్లిస్ రెండు సిక్స్‌లు కొట్టాడు. కృనాల్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్.. భువీకి క్యాచ్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (1)ని రొమారియో షెఫర్డ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జితేశ్‌కు చిక్కాడు. జోష్ ఇంగ్లిస్ దూకుడుగా ఆడటంతో 12 ఓవర్లకు పంజాబ్ 98/3తో మెరుగైన స్థితిలో కనిపించింది.

అయితే, తర్వాతి ఓవర్‌లోనే ఇంగ్లిస్‌ను కృనాల్ వెనక్కి పంపాడు. నేహల్ వధేరా (15), మార్కస్ స్టొయినిస్ (6) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. అయితే, చివర్లో శశాంక్ సింగ్ దూకుడుగా ఆడాడు. భువనేశ్వర్ 19 ఓవర్‌లో సిక్స్, ఫోర్ బాదాడు. హేజిల్‌వుడ్ 20వ ఓవర్‌లో విజయ సమీకరణం 29 కాగా.. తొలి రెండు బంతులు డాట్ అయ్యాయి. తర్వాత దీంతో ఆర్సీబీ విజయం ఖరారైపోయింది. చివరి నాలుగు బంతులకు శశాంక్ వరుసగా 6, 4, 6, 6 బాదినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆర్సీబీ తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. బ్యాటర్లలో విరాట్ కోహ్లి (43; 35 బంతుల్లో 3×4) రాణించాడు. ఫిల్ సాల్ట్ (16; 9 బంతుల్లో 2×4, 1×6) మయాంక్ అగర్వాల్ (24; 18 బంతుల్లో 2×4,1×6), రజత్ పాటిదార్ (26; 16 బంతుల్లో 1×4, 2×6), లివింగ్‌స్టన్ (25; 15 బంతుల్లో 2×6), రొమారియో షెఫర్డ్ (17;9 బంతుల్లో 1×4; 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. జితేశ్ శర్మ (24; 10 బంతుల్లో 2×4, 2×6) మెరుపులు ఆకట్టుకున్నాయి. పంజాబ్ బౌలర్లలో జెమీసన్, అర్‌ష్‌దీప్ సింగ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా అజ్మతుల్లా, యుజ్వేంద్ర చాహల్, విజయ్‌కుమార్ తలో వికెట్ తీశారు.









www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com
సిటీటైమ్స్
బుధవారం | హైదరాబాద్
04.06.2025


# రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం





- సాదా బైనామ ఆన్ లైన్ దరఖాస్తుల పరిశీలనకు కృషి
- బండపల్లి భూ భారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

పానగల్ సిటీటైమ్స్ జూన్ 03 :–

భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం అందించడం జరుగుతుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా మంగళవారం రెవిన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి, పానగల్ మండలంలోని బండపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు, 2020 సంవత్సరంలో సాదా బైనామ సమస్యల పరిష్కారం కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సాదా బైనామ దరఖాస్తుల విషయంలో కోర్టు నుండి సూచనలు వచ్చాక పరిశీలించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ ప్రకారంగా జిల్లాలోని గ్రామాలలో జరిగే భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకొని దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన జిల్లా రైతులకు సూచించారు. రెవెన్యూ అధికారులు మీ మీ గ్రామాలకు వస్తారని భూ సమస్యలు ఏమున్నా నిర్ణిత ప్రొఫార్మలో పూరించి అధికారులకు ఇవ్వాలని, అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. దరఖాస్తు ఫారాలను నింపేందుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సదస్సులో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు, వారి సహకారంతో దరఖాస్తులను పూరించుకొని ఫారాలను అధికారులకు అందజేయాలని తెలిపారు, కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఆర్.ఐ ఇతర సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మానసిక రోగులకు కలుషితాహారం కాటు!

హైదరాబాద్, సిటీ టైమ్స్



హైదరాబాద్ ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో ఒక రోగి మృతి చెందడంతోపాటు మరో 70 మంది అస్వస్థతకు గురికావడం మంగళవారం కలకలం రేపింది. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న 71 మంది మానసిక రోగులు సోమవారం మధ్యాహ్నం భోజనం అనంతరం అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా మారడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు.

# ప్రైవేట్ వ్యాపారం చేసే మిల్లర్ పై కఠిన చర్యలు తప్పవు..

- తెలంగాణలో ఎక్కడ లేని విధంగా ఒక్క నాగర్ కర్నూల్. వనపర్తి జిల్లాలోనే డీఫాల్టర్ల సమస్య....
- డిఫాల్ట్ ఉన్న రైస్ మిల్లర్లు సి.యం.ఆర్ బియ్యని వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి....
- రైతులు పండించిన ధాన్యం మిల్లులకు అప్పగిస్తే బయట నిల్వ చేయడం దారుణం... ధాన్యం తడిచిపోయింది సి.యం.ఆర్ ఇవ్వలేము అనడం క్షమించరాని నేరం...
- ప్రభుత్వం ఇచ్చిన వడ్లు తీసుకోకుండా ప్రైవేటుగా వడ్లు తీసుకొని మిల్లింగ్ చేసే మిల్లులపై చర్యలు కఠిన చర్యలు తీసుకుంటాం...
- డిఫాల్ట్ మిల్లర్లు బియ్యం బకాయిని క్లియర్ చేసి నిజాయితీగా ముందుకు వస్తె సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాము.....

పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్....

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ జూన్ 03





వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉన్న రైస్ మిల్లులు సగానికి పైగా డిఫాల్ట్ అయి ఉండటం ధాన్యం సేకరణకు ప్రధాన సమస్యగా మారిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ అన్నారు. మంగళవారం ఉదయం వనపర్తి జిల్లా ఐ.డి. ఒ సి. సమావేశ మందిరంలో వరి కొనుగోలు పై వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లా అధికారులు, మిల్లర్లు, ఐ.కే.పి, పి. ఎ.సి.ఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్, వనపర్తి అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ వరి కొనుగోలు విషయంలో రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వస్తుందని అన్నారు.దీనికి ప్రధాన కారణం వనపర్తి జిల్లాలో 184 రైస్ మిల్లులు ఉండగా సగానికి పైగా డిఫాల్ట్ అయి ధాన్యం తీసుకోవడంలో దూరంగా ఉండటం ఏంటని విస్మయం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో సైతం సగానికి పైగా మిల్లులు డిఫాల్ట్ అయ్యాయన్నారు.వనపర్తి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి అయితే మిల్లింగ్ చేయడానికి మిల్లులు లేకపోతే మిల్లింగ్ ఎవరు చేస్తారని ప్రశ్నించారు. తాత్కాలికంగా గోదాముల్లో నిల్వ చేసినప్పటికీ అంతిమంగా తిరిగి మిల్లులకు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రభుత్వం నుండి వడ్లు తీసుకోకుండా గట్టిగా ప్రైవేట్ వడ్లు తీసుకొని మిల్లింగ్ చేస్తున్న డిఫాల్ట్ మిల్లుల పై చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డిఫాల్ట్ మిల్లర్లు పాత సి.యం. ఆర్. ను క్లియర్ చేసి ప్రభుత్వం నుండి వడ్లు తీసుకోడానికి ముందుకు రావాలని, సి.యం.ఆర్ క్లియర్ చేసిన వారికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు మిల్లుకు రాకపోవడం వల్ల క్వింటాలుకు 67 కిలోలు రావాల్సిన బియ్యం 62 కిలోలు మాత్రమే వస్తుందని, తద్వారా మిల్లరు నష్టపోతున్నారని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎఫ్. ఎ.క్యూ ప్రకారంగా వడ్లు రావడంలేదని మిల్లర్లు చెప్పడం సరికాదని, కొనుగోలు కేంద్రాలకు ఆధునిక పాడి క్లీనర్లు, ఎండబెట్టే యంత్రాలు, సరిపడా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచి సరైన తేమ శాతం వచ్చాకే తూకం చేసి మిల్లులకు పంపించడ జరుగుతుందన్నారు. వనపర్తి జిల్లాకు మరికొన్ని పాడి క్లీనర్ లు, వాక్యూమ్ పాడి క్లీనర్ లు పంపించడం జరుగుతుందని, తడిచిన ధాన్యం సైతం యంత్రాల ద్వారా ఎండబెట్టి తాలు, చెత్త లేకుండా సరైన తేమతో కొనుగోలు చేసి మిల్లులకు పంపించడం జరుగుతుందన్నారు. యంత్రాల ద్వారా వరి కోతలు చేసే సమయంలో 18 నుంచి 20 ఆర్పీఎం, గేర్ స్పాట్ బి 1 లో ఉంచడం, బ్లోయర్ ఆన్ లో పెట్టుకొని వరి కోతలు చేసేవిధంగా చూడాలని, నిబంధనలు పాటించని హార్వెస్టర్ల పై కేసులు నమోదు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు.సమీక్షలు పాల్గొన్న వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గత 10 అవతారాల్లో ఏ రబీ లోనూ లేని విధంగా ఈసారి వనపర్తి జిల్లాలో అత్యధికంగా వరి పండిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసి రూ. 571కోట్లు 39145 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మొత్తం 415 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా 253 కొనుగోలు కేంద్రాల్లో వరి కొనుగోలు పూర్తి అయిందన్నారు. మరో 20 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని తెలియజేశారు. జిల్లాలో 184 మిల్లులకు గాను డిఫాల్ట్ మిల్లులు పోను కేవలం 77 మిల్లులకు మాత్రమే వడ్లు కేటాయించడం జరిగిందని అయినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు .జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్, వనపర్తి సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం లు, జిల్లా అధికారులు, మిల్లర్లు, ఐ.కే.పి, పి. ఎ.సి.ఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.









# వరి ధాన్యం ఒక్కసారి కొనుగోలు సెంటర్ కు వస్తే పూర్తి బాధ్యత సెంటర్ నిర్వాహకులదే



- నాణ్యమైన వడ్లను సేకరించేందుకు ప్రతి కొనుగోలు సెంటర్ కు వ్యాక్యూమ్ యంత్రాలను పంపిణీ చేస్తాం...
- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది....
- వనపర్తి.. నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించిన పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్ చౌహాన్....

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ జూన్ 03

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో తొలిసారి అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి నాణ్యమైన వడ్లు సేకరించడం జరుగుతుందని పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ తెలియజేశారు.

మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సెక్రెటరీ డి.ఎస్ చౌహాన్ వనపర్తి జిల్లాలో పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లుతో కలిసి పానగల్ మండలంలోని వెంగళాయ పల్లి, తెల్లరాళ్ళ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మీడియా తో మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ఒకసారి కొనుగోలు కేంద్రానికి చేరుకున్న తర్వాత పూర్తి బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అన్నారు. తెలంగాణ చరిత్రలో తొలిసారి నాణ్యమైన వడ్లు సేకరించేందుకు వ్యాక్యూం పాడి క్లీనర్లు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయడం జరిగిందన్నారు. యంత్రాల ద్వారా చెత్త, తాలు, మట్టిని వేరు చేసి నాణ్యమైన వడ్లు వస్తుందని, తేమ శాతం సైతం తగ్గిస్తుందన్నారు. రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం రైతులకు అండగా ఉండి మొత్తం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. నాణ్యమైన వడ్లు మిల్లులకు ఇస్తే ఒక్క గ్రాము తరుగు చేస్తే తనకు ఫిర్యాదు చేయాలని రైతులకు భరోసా కల్పించారు.

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం. సివిల్ సప్లై జగన్మోహన్ తదితరులు ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట ఉన్నారు.



# కేబీఆర్ పార్కు లో చేపట్టిన పనులను పరిశీలించిన కమీషనర్ ఆర్.వి కర్ణన్

హైదరాబాద్, జూన్ 03, (సిటీ టైమ్స్):

వాకర్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పనులను వినూత్నంగా చేపట్టి పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కేబీఆర్ పార్కులో చేపట్టిన పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్ ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని కమీషనర్ ఆదేశించారు. కేబీఆర్ చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్లు, అండర్ పాసులు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజనీర్లు కమీషనర్ కు వివరించారు.కమీషనర్ వెంట అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, డిసి సమ్మయ్య, ప్రాజెక్టు , ఎస్.ఈ శ్రీ లక్ష్మి, ఈ ఈ నాయక్ డిప్యూటీ ఈఈ హరీష్, సర్కిల్ ఈఈ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





### పరిసరాల పరిశుభ్రతతోనే

# వ్యాధుల నివారణ సాధ్యం

**- దోమల నివారణ కోసం ఈనెల 25 వరకు కార్యాచరణ**

**- కార్యక్రమాన్ని ప్రారంభించిన కాప్రా సర్కిల్ డిసి జగన్**

**కాప్రా జూన్ 3 ,(సిటీ టైమ్స్ ):**

వన్ డే వన్ వార్డు కార్యక్రమంలో భాగంగా దోమల నిర్మూలన కోసం ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ సూచించారు. మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని గాంధీ కాలనీలో దోమల నివారణ కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శానిటేషన్, ఎంటమాలజీ విభాగాల కార్మికులకు పలు సూచనలు చేసారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమల నిర్మూలన మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నూతన కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సర్కిల్ డిసి జగన్, కాప్రా డివిజన్ కార్పొరేటర్ శివమణి స్వర్ణరాజు, శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేష్ లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ లోని పలు ఇండ్లలో నీటి నిల్వలను పరిశీలించి సేకరించిన లార్వాపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా ద్వారా అభివృద్ధి చెందే దోమ వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాపిస్తాయని, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఇన్ సెట్ కలెక్టర్లు, సిబ్బంది, శానిటేషన్ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, కార్మికులు, తదితరులు పాల్గొని వన్ డే వన్ వార్డు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మీరేమైనా చరిత్రకారులా..?



**కర్నాటక, సిటీ టైమ్స్**

తమిళ స్టార్ కమల్ హాసన్ వివాదంలో చిక్కుకున్నారు. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కమల్ వ్యాఖ్యలపై కర్ణాటక హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వాక్ స్వాతంత్ర్య హక్కును ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు ఉపయోగించొద్దంటూ హెచ్చరించింది. ఈ వివాదం నేపథ్యంలో కమల్ హాసన్ తాజా చిత్రం 'థగ్‌లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు ది కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై కమల్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తన రాబోయే చిత్రం థగ్ లైఫ్‌ను రాష్ట్రంలో విడుదల చేసి ప్రదర్శించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. విచారణ సందర్భంగా కమల్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'క్షమాపణలు చెప్పకుండా కోర్టుకు వచ్చారా..?' అంటూ తీవ్రంగా మండిపడింది.

'మీరు కమల్ హాసన్ కావొచ్చు.. ఎంత పెద్ద నటుడైనా కావొచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు మీకు లేదు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. నీరు, భూమి, భాష.. ఇవి ప్రజలకు ముఖ్యమైనవి. ఈ దేశ విభజన భాషా ప్రాతిపదికన జరిగింది. ఏ భాష మరొక భాష నుంచి పుట్టదు. మీ వ్యాఖ్యలతో కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీశారు. మీరేమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా..? ఏ ఆధారాలతో ఆ వ్యాఖ్యలు చేశారు..? కన్నడ ప్రజలు మిమ్మల్ని ఏమి అడిగారు..? కేవలం క్షమాపణలే కద. ఈ వ్యవహారంలో ఒక్క క్షమాపణ చెబితే సమస్య మొత్తం పరిష్కారం అవుతుంది' అని న్యాయమూర్తి నాగప్రసన్న వ్యాఖ్యానించారు.

### జీ7 నుంచి భారత్‌కు రాని ఆహ్వానం..

# ఆరేళ్లలో తొలిసారి!

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**



కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్‌పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది. కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యాఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది.

### భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ

# భూ సమస్యలను పరిష్కరించుకోవాలి





**2020 సంవత్సరంలోపు ఆన్ లైన్ దరఖాస్తులు చేస్తున్న సాదా బైనమాలను పరిష్కరిస్తాం...**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జూన్ 03**

ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వనపర్తి జిల్లాలో జూన్ 3 నుంచి జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం పానగల్ మండలంలోని బండపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా రెవెన్యూ అధికారులు మీ గ్రామానికి వచ్చారని, భూ సమస్యలు ఏమున్నా నిర్ణిత ప్రొఫార్మలో పూరించి అధికారులకు ఇవ్వాలని, అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. సాదా బైనామ పై వివరిస్తూ 2020 సంవత్సరంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని ఇప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, మిగిలిన సాదా బైనామా దరఖాస్తుల విషయంలో కోర్టు నుండి సూచనలు వచ్చాక పరిశీలించడం జరుగుతుందన్నారు. భూ సమస్యల పై దరఖాస్తు నింపడానికి ఇబ్బంది ఉన్న వారికి సహాయం చేసేందుకు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ లను పెట్టడం జరిగిందని, వారి సహకారం పొందాలని సూచించారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు చేసుకొని భూ తగాదాలు, సమస్యలు పరిష్కరించుకోవాలని గ్రామ ప్రజలను సూచించారు. షెడ్యూలు ప్రకారం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఆర్.ఐ ఇతర సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మేడం శ్రీదేవి..

# జర ఇదర్ ఏక్ బార్ దేఖో జీ...



**- నాగారం మున్సిపల్ విజయ నగర్ కాలనీలో పాత ఇంటిపై రెండు అంతస్తులతో అక్రమ నిర్మాణం.. ?**

**- నాగారం మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ అధికారుల లీలలు**

**- చోద్యం చూస్తున్న కమిషనర్?**




**నాగారం జూన్ 3, (సిటీ టైమ్స్):**

**అక్రమ నిర్మాణాలపై చూసి చూడనట్లుగా చోద్యం చూస్తున్న నాగారం టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు.. దోచుకున్న వాడికి దోచుకున్నంత మహదేవా... అన్నట్టుగా మారింది నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారం. నాగారం మున్సిపల్ 9 వ వార్డు లోని విజయ నగర్ కాలనీలో పాత ఇంటిపై అక్రమంగా రెండు అంతస్తులతో అక్రమ నిర్మాణాలు పూర్తి...? ఈ అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు ఉన్నాయా.. లేక స్థానిక నాయకుల ప్రమేయం ఉన్నదా... ఉంటే తక్షణమే నాగారం టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. నాగారం మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు అడ్డంగా నిలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న తీరు చూస్తుంటే ఔరా అనిపిస్తుంది. ఇందుకు నిదర్శనమే నాగారం పరిధిలోని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న తీరు..? ఈ అక్రమ నిర్మాణానికి స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు దాసోహం అయ్యారన్న విమర్శలు వస్తున్నాయి.**

ఇది ఇలా ఉండగా నాగారం మున్సిపల్ పరిధిలో ఇల్లు కట్టాలి అంటే టీఎస్ బి పాస్ అవసరమే లేదా...? మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ విచారణ చేస్తే సుమారు 70 శాతం నిర్మాణాలకు అనుమతులు ఉండవు. కానీ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు తమ ఇష్టానుసారంగా అక్రమమాలకు పాల్పడుతూ ప్రభుత్వ చట్టాలను సైతం తుంగలో తొక్కేసి అందినకాడికి దండుకుంటూ.. ధనర్జనే ధ్యేయంగా తమ విధులను నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి తమ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై తక్షణమే విచారణ చేపట్టి అక్రమదారులకు బుద్ధి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# బ్రహ్మపుత్ర నీటిని

# చైనా ఆపితే ఎలా?





**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన తర్వాత పాక్ ఇటీవల తెరపైకి తెచ్చిన 'ఒకవేళ బ్రహ్మపుత్ర నీటిని చైనా ఆపితే' అనే ప్రచారాన్ని గణాంకాలు వాస్తవాలతో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిప్పికొట్టారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టును రాసుకొచ్చారు. అసలు ఈ ప్రచారానికి ఎటువంటి ఆధారం లేదని కొట్టి పారేశారు.

" కాలం చెల్లిన సింధూ జలాల పంపిణీ ఒప్పందం నుంచి భారత్ బయటపడ్డాక.. ఇప్పుడు పాకిస్థాన్ మాకు కొత్త బూచిని చూపించే ప్రయత్నం చేస్తోంది. ఒకవేళ చైనా బ్రహ్మపుత్ర నీటిని భారత్‌కు రాకుండా ఆపేస్తే పరిస్థితి ఏమిటీ..? అంటూ ప్రచారం మొదలు పెట్టింది. ఈ ఊహాజనిత కట్టుకథను.. వాస్తవాలతో తిప్పికొడదాం.

బ్రహ్మపుత్ర నది భారత్‌లో ప్రవహించే కొద్దీ విస్తరిస్తుందే కానీ.. కుంచించుకుపోదు. చైనా నుంచి కేవలం 3035శాతం జలాలు మాత్రమే వస్తాయి. వీటిల్లో చాలావరకు మంచు కరిగి.. టిబెట్‌లోని పరిమిత వర్షాల వల్ల లభిస్తాయి. ఇక మిగిలిన 6570శాతం నీరు భారత్ నుంచి వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, నాగాలాండ్, మేఘాలయాలో రుతుపవనాల వల్ల కురిసే వర్షాలకు ధన్యవాదాలు చెప్పాలి. ఇక శుభాంశ్రీ, లోహిత్, కమెంగ్, మానస్, ధన్‌శ్రీ, జియా భరాలి, కోపిలి దీనికి ప్రధాన ఉపనదులు. ఇవికాక ఖాసీ గారో, జయంత హిల్స్ నుంచి కుల్సీ, కృష్ణాయ్, దిగారు నదుల నుంచి మిగిలిన జలాలు లభిస్తాయి. అది భారత్‌చైనా సరిహద్దుల్లో సెకనుకు 2,000 3,000 క్యూబిక్ మీటర్ల మేరకు నీరు ప్రవహిస్తుంది. అదే అస్సాంలో రుతుపవనాల సీజన్‌లో సెకన్‌కు 15,00020,000 క్యూబిక్ మీటర్లగా ఉంటుంది.

బ్రహ్మపుత్ర జలాల కోసం భారత్ ఎగువ నుంచి వచ్చే ప్రవాహం కోసం ఆధారపడాల్సిన అవసరం లేదు. అది వర్షాధారిత భారత నది. భారత్‌లోకి వచ్చాకే అది బలపడుతుంది. పాకిస్థాన్ తెలుసుకోవాల్సిన నిజం ఏమిటంటే.. ఒకవేళ నీటి ప్రవాహాన్ని తగ్గించాలనుకుంటే (ఇప్పటివరకు చైనా ఆ దిశగా సంకేతాలు గానీ, బెదిరింపులు గానీ ఏ వేదిక పైనా చేయలేదు) అది భారత్‌కే ప్రయోజనకరం. ఎందుకంటే ఇక్కడ అస్సాంలో ఏటా వచ్చే వరదలు తగ్గి.. లక్షల మంది నిరాశ్రయులు కాకుండా ఉంటారు.

ఇక పాకిస్థాన్ కొన్ని దశాబ్దాలుగా సింధూజలాల ఒప్పందంలో లభించిన ప్రాధాన్యంతో దోచుకుంది. ఇప్పుడు భారత్ వాస్తవంగా తనకు రావాల్సిన హక్కు అడగడంతో బెంబేలెత్తిపోతోంది. వారు ఒకటి గుర్తుంచుకోవాలి. బ్రహ్మపుత్ర కేవలం ఒక్క దానితో నియంత్రించలేము. అది మా భౌగోళిక పరిస్థితులతో, మా రుతుపవనాలతో బలోపేతమైంది'' అని పేర్కొన్నారు. ఇటీవల సెంటర్ ఫర్ చైనా అండ్ గ్లోబలైజేషన్ వైస్ ప్రెసిడెంట్ విక్టర్ జికాయ్ గావ్ తొలిసారి ఈ అంశాన్ని లేవనెత్తాడు. భారత్ సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేయడంపై స్పందిస్తూ.. బ్రహ్మపుత్ర నది నుంచి నీరు భారత్‌కు వెళ్లకుండా చైనా ఆపగలదని పేర్కొన్నాడు. ఈ అంశాన్ని పాక్ మీడియా విపరీతంగా ప్రచారంలోకి తీసుకొచ్చింది.

# అందమైన బహుమతులు, క్యాండిల్ లైట్ డిన్నర్లు కాదు.. అమ్మాయిలకు నచ్చాలంటే అబ్బాయిలు ఇలా ఉండాలి





ప్రేమలో ఎప్పుడూ అబ్బాయిలు.. అమ్మాయిలకు ఖరీదైన బహుమతులు ఇచ్చి వారిని సర్‌ప్రైజ్ చేయాలని చూస్తారు. ఒకప్పుడు బహుమతులకు అమ్మాయిలు పడేవారు కానీ.. ఇప్పుడు అమ్మాయిలు ఎంతో మారారు. అందమైన బహుమతులు, క్యాండిల్ లైట్ డిన్నర్లు, లగ్జరీ కార్లలో ప్రయాణాలకు వారు సంతోషించడం లేదు. వారికి నచ్చేలా అబ్బాయిలు చిన్న చిన్న ఆనందాలను ఇస్తే చాలు, వారు భావోద్వేగపరంగా కనెక్ట్ అయిపోతారు.

## సర్వే ప్రకారం

బంబుల్ ఇండియా అనే డేటింగ్ సైట్ ఇటీవల ఒక సర్వేను నిర్వహించింది. దీనిలో 61 శాతం మంది అమ్మాయిలు ప్రేమలో పడిన తర్వాత చిన్న చిన్న ఆనంద క్షణాలే తమకు ముఖ్యమని చెప్పారు. భాగస్వామి చేసే చిన్న చిన్న పనులే తమ హృదయాన్ని గెలుచుకుంటాయని వివరించారు. అతని నుంచి ఖరీదైన బహుమతులు, ఫైవ్ స్టార్ హోటల్లలో విందును తాము కోరుకోవడం లేదని అన్నారు.

రిలేషన్ షిప్ నిపుణులు ఈ సర్వే గురించి మాట్లాడుతూ చిన్నప్పటినుంచి అమ్మాయిలను సిండ్రెల్లా వంటి యువరాణి కథలు వింటూ పెరుగుతారని, వారి ఊహల్లో అలాంటి ఒక సొంత ప్రపంచం ఉంటుందని వివరిస్తున్నారు. ఆమె ఎవరైనా తనను యువరాణిలా చూస్తే చాలు ఎంతో పొంగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. భాగస్వామితో కలిసి వర్షంలో తడవడం, బయట టీ కొట్టు దగ్గర నిలుచుని కాసేపు వేడి వేడి వేడి టీ తాగడం, జోకులు చెప్పకోవడం, కవితల రాసుకోవడం, కలిసి పానీపూరీలు తినడం.. వంటి చిన్న



చిన్న విషయాలే అమ్మాయిలను ఎక్కువ ఆనంద పరుస్తాయని వివరిస్తున్నారు.

## అమ్మాయిలే రొమాంటిక్

బ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే చాలా రొమాంటిక్ అని ఎన్నో అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. రొమాంటిక్ పుస్తకాలు చదవడం, రొమాంటిక్ సినిమాలు చూడటానికి అబ్బాయిలు కంటే అమ్మాయిలే ఎక్కువ ఆసక్తిగా చూపిస్తారు. సినిమాల్లోలాగే తమ జీవితంలో కూడా తమను మహారాణిల చూసుకునే, గౌరవించే మనిషి రావాలని కోరుకుంటారు. చిన్న చిన్న క్షణాలనే ప్రత్యేకంగా చూసే వ్యక్తి తమ జీవిత భాగస్వామి కావాలని ఆశిస్తారు.

## దీనికి హార్మోన్లే కారణం





ఇలా మహిళలు చిన్న చిన్న ఆనందాలని కోరుకోవడానికి వారిలోని హార్మోన్లే కారణమని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి మనిషి మెదడులో భావోద్వేగాలను నియంత్రించే వ్యవస్థ ఉంటుంది. ఈ వ్యవస్థ పరిమాణం పురుషుల కంటే స్త్రీలలో పెద్దదిగా ఉంటుంది. అందుకే వారు త్వరగా భావోద్వేగాలకే గురవుతారు. ప్రేమ హార్మోన్ గా పిలిచే ఆక్సిటోసిన్ స్త్రీలలో అధికంగా విడుదలవుతుంది. అందుకే వారు చాలా రొమాంటిక్‌గా కూడా ఉంటారు.

ప్రేమ బంధంలో గడిపిన చిన్న చిన్న క్షణాలే జంటలను ఒకరికొకరు దగ్గర చేస్తాయి. కలిసి వాకింగ్ చేయడం, కలిసి తినడం, కలిసి పుస్తకాలు చదువుకోవడం వంటి చిన్న చిన్న పనులే వారి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడకుండా అడ్డుకుంటాయి. దీనివల్ల ఒకరితో ఒకరు ఎక్కువ సమయాన్ని గడుపుతారు. వారి బంధం మరింత బలపడుతుంది. అంతేకాదు ఆ బంధంలో నిజాయితీ, గౌరవం కూడా ఉంటాయి. ఒక అబ్బాయి దగ్గర డబ్బు తక్కువగా ఉన్నా కూడా అతడు చిన్న చిన్న క్షణాలను తమతో ఆనందంగా పంచుకుంటే చాలు... అమ్మాయిలు జీవితాంతం అతనితో సంబంధాన్ని సంతోషంగా కొనసాగిస్తారు.



## కన్నీరు పెట్టుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

మహబూబాబాద్, సిటీ టైమ్స్

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. పక్కనే ఉన్న మహిళలు ఊరుకో అక్కా అంటూ ఓదార్చారు. ఇంతకీ ఈ యువ ఎమ్మెల్యేకి ఏం కష్టమొచ్చింది. కన్నీరు పెట్టడానికి గల కారణం ఏమయ్యుంటుందబ్బా అని ఆలోచిస్తున్నారా? ఇంతకీ ఏం జరిగిందంటే.. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం రైతు వేదికలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో యశస్విని రెడ్డి పాల్గొన్నది. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేసే సమయంలో భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకుంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో తన చేతుల మీదుగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేయడం పట్ల బాగోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకుంది ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. ఆ సమయంలో పక్కనే ఉన్న మహిళలు ఊరుకో అక్కా అంటూ ఓదార్చారు. పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. ఈ పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులను మంజూరు చేస్తోంది.

## మరో 4 రోజులు వర్షాలు

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. గత కొద్దిరోజులుగా వర్షా లు కురుస్తున్న సంగతి తెలిసిందే. మరో నాలుగైదు రోజుల పాటు కూడా వర్షా లు కురిసే అవకాశం ఉంది. కొన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం... కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. జూన్ 4వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు



రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షా లు కురిసే అకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ తేదీల్లో ఎలాంటి హెచ్చరికలు లేవని స్పష్టం చేసింది. మరోవైపు ఇవాళ హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షం పడొచ్చు. లేదా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన జల్లుల పడే అవకాశం ఉంది. ఉపరితల గాలులు పశ్చిమ నైరుతి దిశలో గంటకు 6 -10 కి.మీ వేగంతో వీచే అకాశం ఉంది.

ఏపీలో వాతావరణం ఇలా:

ఏపీలో ఇవాళ ఏలూరు,కృష్ణా, ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉక్కపోత ఉండే అవకాశం ఉంది. గరిష్టంగా 39-40°C వరకు ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇక మన్యం,అల్లూరి,కాకినాడ జిల్లాల్లోని కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉంది.మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షా లు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## ఎంతో జాగ్రత్తగా భూభారతి తీసుకొచ్చాం

### రైతులకు ఎంతో ఉపయోగపడేలా ఉంది
### అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టం
### కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ఖమ్మం, సిటీ టైమ్స్

రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను



సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## ఖమ్మం జిల్లా ఆయిల్ పామ్ హబ్‌గా మారాలి

భద్రాద్రి కొత్తగూడెం, సిటీ టైమ్స్

రాష్ట్రంలో పామాయిల్ సాగుకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఆయిల్ పామ్ పంటకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉందని, ఇది రైతులకు స్థిర ఆదాయం కలిగించే లాంగ్‌టర్మ్ పంట అని పేర్కొన్నారు.

మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో వ్యవసాయ అధికారులతో పామాయిల్ సాగుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ పంటను మరింత విస్తృతంగా సాగు చేయించాలని, ప్రతి రైతుకు పామాయిల్ మొక్కలు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ పంట 25 నుంచి 30 ఏళ్ల జీవన కాలం కలిగి ఉంటుంది, ఇతర నూనె పంటల కంటే మూడు రెట్లు అధిక దిగుబడిని, తక్కువ నీటి వినియోగంతో పాటు వ్యవసాయ ఆదాయ స్థిరీకరణకు అత్యుత్తమ మార్గం కాబట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు నేరుగా గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగవుతున్న పామాయిల్ పంటను చూసి రాష్ట్రం మొత్తం ఆశ్చర్యపోవాలి అని ఇది కేవలం పంట కాదు, భవిష్యత్ ఆదాయానికి బలం అని తుమ్మల వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు,



మండల స్థాయి వ్యవసాయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, యర్ర వసంతరావు, కోటగిరి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరికి సమాధానం చెప్పాల్సిన పని లేదు



లేడి సూపర్ స్టార్ నయనతార ఇద్దరు పిల్లలకి తల్లైన కూడా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడుపుతుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో అరడజనుకి పైగా చిత్రాలు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర భాషలలో కూడా సినిమాలు చేస్తుంది. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరి హీరోలతో కలిసి పని చేస్తుంది. ఇప్పడు మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తుంది. ఈ మూవీని అనీల్ రావిపూడి తెరకెక్కిస్తున్నాడు. అయితే సాధారణంగా నయనతార ప్రమోషన్ కార్యక్రమాలకి చాలా దూరంగా ఉంటుంది. కాని చిరు సినిమాకి ముందు నుండే ప్రమోషన్స్ మొదలు పెట్టింది. ఆ మధ్య అనీల్ రావిపూడి చెన్నైకి వెళ్లి ఆమెతో ఓ ప్రమోషన్ వీడియో చేయించాడు. అది నెట్టింట తెగ వైరల్ అయింది. సాధారణంగా ఎంత పెద్ద హీరో సినిమా అయిన సరే నయనతార పెద్దగా ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొనదు. వారికి ముందుగానే హింట్ ఇచ్చేస్తుంది. తమిళ సినిమా ప్రమోషన్స్‌లో కూడా ఎప్పడు పెద్దగా పాల్గొనింది లేదు. కాని చిరు- అనీల్ రావిపూడి సినిమాకి ముందు నుండే ప్రమోషన్ మొదలు పెట్టేసరికి తమిళ సినిమాల ప్రమోషన్లలో ఏనాడూ పాల్గొనని నువ్వు తెలుగు సినిమాకి అదీ షూటింగ్ మొదలు కాకముందే ప్రమోషన్స్ చేస్తున్నావు. తెలుగు సినిమాలంటే అంత ఇష్టం ఉందా.. అయితే టాలీవుడ్‌కే షిఫ్ట్ అయిపోవచ్చు కదా అని కొందరు ట్రోల్ చేస్తున్నారు.



## నేనెంత అదృష్టవంతురాలినో ఇప్పుడు తెలుస్తోంది

"నా ప్రయాణంలో కఠినమైన పాఠాలు ఉండవు.. అన్నీ విలువైనవే ఉంటాయ"ని అంటోంది అందాల తార రష్మిక . 'పుష్ప' చిత్రాలతో శ్రీవల్లిగా అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ భామకు ప్రస్తుతం అవకాశాలు వరుస కడుతున్నాయి. ఇటీవలే సల్మాన్‌ఖాన్‌తో కలిసి 'సికందర్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఇప్పడీ విషయంపై స్పందిస్తూ.. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని అర్థం చేసుకుంటే ఒత్తిడి ఉండదని చెప్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక.. తన సినీ ప్రయాణంలోని విమర్శలు, ఒత్తిళ్ల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "నిజం చెప్పాలంటే నా చిన్నప్పటి నుంచి ఈ రంగంలోకి అడుగుపెడతానని ఎప్పడూ ఊహించలేదు. అసలు నటన అనేది నా ప్రణాళికలోనే లేదు. కానీ ఈ వృత్తి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఇప్పడు వెనక్కి తిరిగి చూసుకుంటే.. నేను ఆ రోజు ధైర్యంతో ఒక్క అడుగు ముందుకు వేసినందుకు సంతోషంగా ఉంది. నా కెరీర్‌ని అర్థవంతమైన మార్గంలో తీసుకెళ్తున్న ఇలాంటి రంగంలో నేనూ భాగమైనందుకు ఎంత అదృష్టవంతురాలినో ఇప్పడిప్పడే అర్థమవుతోంది". "ఇన్నేళ్ల నా సినీప్రయాణంలో విజయాలు, విమర్శలు, ఒత్తిళ్లు చాలానే ఉన్నాయి. కానీ జీవితంలో ఏదీ శాశ్వతం కాదని నాకు తెలుసు. ఈ విషయం గురించి నేను ఇంతక ముందు కూడా మాట్లాడాను. ఒక రోజు మనం అనుకున్నట్లుగా ఉండకపోవచ్చు. మరుసటి రోజు మాత్రం అంతా మారిపోతుంది. జీవితంలో ఏం జరిగినా ఈ రోజు గడిచిపోతుందనే నమ్మకంతో ఉండాలి. దీంతో పాటు నిన్ను నమ్మే వ్యక్తులు నీ చుట్టూ ఉండాలి. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నా కుటుంబం, స్నేహితుల నుంచి కచ్చితంగా నాకు మద్దతు ఉంటుంది. ఒడుదొడుకులను ఎదుర్కోవడంలో ఎప్పడూ అండగా ఉంటారు. అందుకే విమర్శలయినా, విజయమైనా ప్రతి క్షణాన్ని ఆస్వాదించడానికే ప్రయత్నిస్తుంటా".



## 'ది రాజా సాబ్' ఆగమనం.. అదిరిపోయే అప్‌డేట్ పంచుకున్న టీమ్




ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' . భారీ అంచనాల మధ్య రానున్న ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది.ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి - ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు వెల్లడించారు.

## ఎన్ని కుట్రలు పన్నినా.. నన్నెవరూ ఆపలేరు: ధనుష్



జీవితంలోని ఎన్నో ముఖ్యమైన సత్యాల్ని 'కుబేర' చిత్రీకరణ సమయంలో తాను తెలుసుకున్నానన్నారు కథానాయకుడు ధనుష్ . ఈ సినిమా ప్రేక్షకులపై చూపించే ప్రభావం గురించి ఎంతో నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. ఆయన.. నాగార్జున ప్రధాన పాత్రధారులుగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన బహుభాషా చిత్రమే 'కుబేర' . సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మించారు. రష్మిక కథానాయిక. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చెన్నైలో ఆడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ధనుష్ మాట్లాడుతూ.. "ఇది కలికాలం. ద్వేషం, ప్రతికూలత, అసూయ వృద్ధి చెందే సమయం. ఇప్పడు మంచిపై చెడు విజయం సాధిస్తున్నట్లు అనిపిస్తోంది. నేనెప్పడూ ప్రతి సినిమాకీ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటా. కానీ, నా సినిమాల విడుదలకు ఒకటిన్నర నెల ముందు నుంచే నెగిటివ్ క్యాంపెయిన్‌లు మొదలవుతుంటాయి.



## కోహినూర్ కహానీ?


పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు – పార్ట్ 1' సినిమా ఈ నెల 12 నుంచి థియేటర్లలో సందడి చేయనున్న విషయం తెలిసిందే. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో కొంత భాగం పూర్తయిన ఈ సినిమాను, జ్యోతికృష్ణ పూర్తి చేశారు. ఇదిలావుంటే.. ఇదే వీరమల్లు కథ అంటూ సోషల్ మీడియాలో ఓ లైన్ హల్‌చల్ చేస్తున్నది. ఇందులో హరిహర వీరమల్లు అనే దొంగగా పవన్‌కల్యాణ్ కనిపిస్తారట. ఉన్నోడ్ని కొట్టి లేనోడికి పెట్టే రాబిన్‌హుడ్ తరహా పాత్ర అన్నమాట. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్య కాలంలో ఈ కథ నడుస్తుందట. గోల్కొండ తానీషా నుంచి మొదలైన కథ, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దగ్గర ముగుస్తుందట. కోహినూర్ వజ్రం ఈ కథకు కీలకమని సమాచారం. మొఘల్ రాజు ఆస్థానంలో ఉన్న ఆ వజ్రాన్ని దొంగిలించేందుకు హీరో చేసే ప్రయత్నమే ఈ సినిమా కథ అట. పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ తొలి జానపద చిత్రంలో పంచమి అనే పాత్రలో నిధి అగర్వాల్ నటిస్తుండగా, ఔరంగజేబుగా బాబీడియోల్ కనిపిస్తారట. ఇక ఏయే పాత్రలు ఎవరు పోషిస్తారనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## ఆ రోజు తెలుసు కదా!

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'తెలుసు కదా' విడుదల ఖరారైంది. అక్టోబరు 17న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం సోమవారం ప్రత్యేకమైన వీడియోతో ప్రకటించింది. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వప్రసాద్, టి.జి.కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇద్దరిని ప్రేమించిన ఓ యువకుడి కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. "మనసుని తాకే భావోద్వేగాలతో, ఊహించని మలుపులతో సాగే కథ ఇది. దర్శకురాలిగా పరిచయం అవుతున్న నీరజ కోన తెలుగు సినిమాకి ఓ కొత్త వాయిస్‌ని అందించబోతున్నారు. దీపావళి ముందు రోజు వస్తున్న ఈ చిత్రం పండగ సంబరాల్ని రెట్టింపు చేస్తుంది. సిద్ధు జొన్నలగడ్డ మరో కొత్తతరం పాత్రతో ప్రేక్షకుల్ని అలరిస్తార"ని సినీ వర్గాలు చెప్పాయి. వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా.



## న్యూయార్క్ నగరంలోని కొత్త రహస్యాలు!



"పునరుత్థానం పొందాలంటే నరకం గుండా వెళ్లాలి.." అంటున్నారు హాలీవుడ్ నటుడు మిచెల్ సి.హాల్. మరి ఆయన ఎందుకు అలా అంటున్నారు? దీని వెనుక ఉన్న కారణం ఏంటో తెలియాలంటే 'డెక్స్‌టర్: రిసరెక్షన్' సిరీస్ చూడాల్సిందే. అమెరికన్ క్రైమ్ డ్రామా, సైకలాజికల్ థ్రిల్లర్, మిస్టరీ నేపథ్యంలో జేమ్స్ మనోస్ జూనియర్ రూపొందిస్తున్న సిరీస్ ఇది. జెఫ్ లిండే రచించిన 'డార్క్లీ డ్రీమింగ్ డెక్స్‌టర్' అనే నవల ఆధారంగా తెరకెక్కుతుంది. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్‌బృందం. "కొత్త నగరం.. కొత్త రహస్యాలు" అనే వ్యాఖ్యను జోడించింది. "న్యూయార్క్‌కు వెళ్లడానికి ఆహ్వానం అందింది.. మీరు వెళ్తున్నది చీకటి మార్గం.." లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్‌లో న్యూయార్క్‌లో హత్యలు చేస్తున్న సీరియల్ కిల్లర్ పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు నటుడు మిచెల్ సి.హాల్.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**